క్లుప్తంగా

ఆలయాల పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్

నేలకొండపల్లి: దేవాలయాల పాలకవర్గాల ఏర్పాటుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటీస్ విడుదలైన 20 రోజుల లోపు దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. నేలకొండపల్లి మండలంలోని శ్రీ భీమేశ్వరస్వామి, శ్రీ ఉత్తరేశ్వర స్వామి దేవాలయాలు, చెరువుమాధారంలోని శ్రీ లక్ష్మి నరసింహాస్వామి దేవాలయాలకు పాలకవర్గాల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించనుంది. అదే విధంగా కూసుమంచి మండలంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి, పెరికసింగారంలోని శ్రీ వేణుగోపాలస్వామి, జీళ్లచెరువులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాలకు ట్రస్టు కమిటీలను ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కమిటీల్లో 8 మంది డైరెక్టర్లు ఉండగా వారిలో చైర్మన్, మిగతా ఆరుగురు డైరెక్టర్లతో పాటు దేవాలయం అర్చకుడు డైరెక్టర్‌గా ఉంటారు. నోటిఫికేషన్ విడుదల చేయటంతో కాంగ్రెస్ నాయకులు కమిటీ కూర్పు కోసం కసరత్తు ప్రారంభించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వీరభద్రరావు

కూసుమంచి: కూసుమంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇంటర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బి.వీరభద్రరావును నియమిస్తూ జిల్లా ఇంటర్ విద్యాధికారి కె. రవిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో చేరిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

విరాళాల సేకరణ

ఖమ్మంరూరల్: కేరళ వరద బాధితుల సహాయార్థం మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడుతూ... తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నెకంటి సంగయ్య, ఉపేందర్, ఏ. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి

ఖమ్మంఅర్బన్: జిల్లా విజృంభిస్తున్న డెంగీ, విషజ్వరాల వ్యాప్తిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం టీడీపీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, శ్రీను, రాజరాజేశ్వరి, క్రిష్ణప్రసాద్, కోటేశ్వరావు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

నేలకొండపల్లి: దివ్యాంగులపై అనుచితంగా మాట్లాడిన ఐఏఎస్ సిత్మ సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని చేపట్టిన ఆందోళన రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీవీ. చలమయ్య మాట్లాడుతూ... దివ్యాంగుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని, ఆమె పై చర్యలు తీసుకోకుంటే అమరణ నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చిర్రా భిక్షం, రామకృష్ణ, నాగేశ్వరరావు, పుల్లయ్య, వీరన్న, సత్యనారాయణ, ప్రకాశం, బ్రహ్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పెంచాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

కామేపల్లి: ముచ్చర్ల నుంచి తిమ్మారావుపేట మార్గంలో ఆర్టీసీ బస్సు అదనపు సర్వీస్‌లను పెంచాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాలె శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్‌ను చేశారు. ఈ మేరకు గురువారం ముచ్చర్లలో సర్వీస్ పెంచాలని విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ నామమాత్రపు సర్వీస్‌తో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురానికి చెందిన బి.బాబురావు(25) గురువారం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయన్ని గమనించిన కుటుంబీకులు నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

సన్మానం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల బదిలీ అయిన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు జర్పుల రమేష్‌ను గురువారం పలువురు ఉద్యోగులు సన్మానించారు. సిబ్బంది ఖాదర్, సరళ, నాగరాజు ఉన్నారు.

పగలు తాళం.. రాత్రి చీకటి



పార్కులో నిరుపయోగంగా మారిన సోలార్ ప్లాంట్, ఓపెన్ జిమ్

నిరుపయోగంగా చైతన్యనగర్ పార్కు
- మసకబారిన సోలార్ వెలుగులు
- దెబ్బతిన్న జిమ్, వాకింగ్ ట్రాక్
- పాములు, కుక్కలకు స్థావరంగా మారిన వైనం
- పార్కుకు వెళ్లాలంటే జంకుతున్న జనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఖమ్మంఅర్బన్: నగర వాసులకు ఆహ్లాదం అందించాలని, కాల్వకట్ట భూములు ఆక్రమణలకు గురి కాకుండా ఉండాలనే ఉద్దేశంతో గత నాలుగేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి చైతన్యనగర్ పార్కును నిర్మించారు. కానీ ప్రస్తుతం అది ఆహ్లాదం పంచకుండా పగులు తాళం, రాత్రి అంధకారంతో పాములు, కుక్కలకు స్థావరాలుగా మారింది. ప్రారంభంలో మిరిమిట్లు గొలిపే రంగురంగుల వాటర్ ఫాల్స్‌తో కూడిన లైట్లు, సోలార్ విద్యుత్ వినియోగం, రూ.లక్షలు విలువైన వివిధ రకాల మొక్కలు, చుట్టూ ఉన్న నివాసాల గోడలపై అందమైన పెయింటింగ్‌తో తలుక్కుమంది. 2020 ఏడాదిలో ప్రారంభం తర్వాత మూడేళ్ల పాటు నగర వాసులకు ఆహ్లాదం అందించి ఇప్పుడు సోలార్ వెలుగులు లేక మసకబారింది.

దెబ్బతిన్న జిమ్, వాకింగ్ ట్రాక్..

సాగర్ ప్రధాన కాల్వ నుంచి లకారం చెరువు, ఇందిరానగర్ సెంటర్ వరకు ఉన్న మేజర్ కాల్వలను సీసీ వాల్స్ నిర్మాణం చేశారు. దానికి ఇరువైపుల కట్టలను బలపర్చి పార్కుగా తయారు చేసి దానికి సమీపంలోనే ఓపెన్ జిమ్ సైతం ఏర్పాటు చేశారు. కానీ అందులోని పరికరాలు, అందులో వేసిన ఫ్లోరింగ్ దెబ్బతింది. అంతేకాక వాకింగ్ ట్రాక్ సైతం నిరుపయోగంగా ఉంది. పార్కు మధ్యలో నుంచి వెళ్తున్న మేజర్ కాల్వలో నీరు నిలిచి ఉండడంతో చెత్తాచెదారం చేరి కంపు కొడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పార్కుకు పూర్వవైభవం తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చీకటి పడితే బంద్..


పనిచేయని వాటర్ ఫాల్స్

పార్కులో రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో పవర్ గ్రిడ్ నుంచి వచ్చే విద్యుత్ కేబుల్ దెబ్బతినడంతో సాయంత్రం చీకటిపడితే చాలు లోపలికి వెళ్లే పరిస్థితి లేదు. ఉదయం, సాయంత్రం ఒకటి లేదా రెండు గంటల పాటు తెరిచి ఉన్నా.. ఆ సమయాన పనుల్లో ఉండే వారు వచ్చే అవకాశం లేదు. దీంతో రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగంగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..


పార్కులో కేబుల్ దెబ్బతినడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఓపెన్ జిమ్‌లో పాడైన ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది. లైటింగ్ ఉంటే నాలుగైదు డివిజన్ల ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.
– చావా మాధురినారాయణరావు, కార్పొరేటర్

చర్యలు తీసుకోవాలి..


రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పార్కులోకి సాయంత్రం వెళ్లాలంటే భయంగా ఉంటుంది. లైట్లు వెలగకపోవడంతో ఆహ్లాదం కంటే ప్రాణం ముఖ్యమని అటువైపు వెళ్లడం లేదు. మూలనపడ్డ సోలార్‌పై దృష్టి సారించి ఆహ్లాదం అందించేలా చర్యలు తీసుకోవాలి.
– వాకదాని కోటేశ్వరరావు, స్థానికుడు

కష్టసుఖాల్లో పాలు పంచుకుంటాం..

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


తీజ్ వేడుకల్లో మాట్లాడుతున్న పొంగులేటి

ఖమ్మంరూరల్: ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కష్టసుఖాల్లో ప్రభుత్వం పాలుపంచుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాయుడుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరుగ్యారంటీలతో పాటు అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించుతామని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ చేసిన తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకే ఇలాంటి కుట్ర పూరితమైన ఆరోపణలు చేస్తోందన్నారు. అనంతరం సాయిగణేష్‌నగర్‌లో జరిగిన తీజ్ వేడుకలను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు ధరావత్ రామ్మూర్తినాయక్, మద్ది మల్లారెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొలంబాటతో విద్యుత్ సమస్యల పరిష్కారం

● డీఈఈ నాగేశ్వరరావు


రైతులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పొలం బాటను రైతులు వినియోగించుకోవాలని, ఈ కార్యక్రమంతో విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఖమ్మం రూరల్ డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముజ్జుగూడెంలో గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు మోటార్ల వద్ద కెపాసిటి కలిగిన కెపాసిటర్లను వాడాలన్నారు. ఈ సందర్భంగా రైతులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించారు. వంగిన స్తంభాలు సరిచేయటం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు మార్చటం, కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయటం లాంటి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఏడీఏ కోక్యానాయక్, ఏఈ కె.రామారావు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

12 శాతం రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి, మాదిగల రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పు వెల్లడించి వర్గీకరణ అధికారం రాష్ట్రాలకే ఉందని ఇచ్చిన తీర్పు అభినందనీయమన్నారు. జిల్లాలో మాదిగలకు అన్యాయం జరిగిందని, ఈసారైనా మాదిగలకు రాజ్యసభ ఇవ్వాలన్నారు. ఈనెల 11న హైదరాబాద్‌లో జగ్జీవన్‌రామ్ భవనంలో జరిగే మాదిగ సంఘాల సదస్సు జయప్రదం చేయాలని వారు కోరారు. మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి వినాయక రావు, మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మట్టె గురుమూర్తి, శ్రీరామ్, మహేష్, కిషోర్, సిద్దార్థపూలే, అనిల్, మురళి, మందా ఉషా, ఉపేందర్ పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి


ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. కలెక్టరేట్ నుంచి వెంకటాయపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలకు రూ.10 లక్షలు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, రామయ్య, అర్జున్‌రావు, ఆవుల అశోక్, బందెల వెంకన్న, కమ్మ నాగేశ్వరరావు, కె.వెంకన్న, సిహెచ్.శిరోమణి, మంగతాయి, లలిత, లాల్మియా, శ్రీను, శోభ, లాజర్, ఆజాద్, శరత్, రాందాస్, రాకేష్ ,ప్రేమ్ సింగ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మానవ మనుగడకు కీలకమైన పర్యావరణ పరిరక్షణ, ఆవశ్యకతపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ అండ్ అడ్వకసీ సంస్థ ఆధ్వర్యంలో క్లైమైట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్‌ను కళాశాలలో ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించామన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్ షాద్‌నగర్‌లో దళితమహిళను దొంగతనం నేపంతో చిత్రహింసలకు గురిచేసిన డిటెక్టివ్ సీఐ రామ్ రెడ్డి ఐదుగురు కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి తొలగించి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు, ఉపేందర్ సాహూ, నాగరాజు, విజయ్‌కుమార్, రమేష్, వంశీ, నవీన్ ఉన్నారు.

పాటకు భావమే ముఖ్యం

ఖమ్మంసహకారనగర్: మనోలయతో రాసేది పాటని, పాటకి రాగం, తాళం, భావం ముఖ్యమని ప్రముఖ గజల్ రచయిత, వాగ్గేయకారుడు, ప్రధానోపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్య అన్నారు. స్థానిక ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు 'పాట పై మాట' అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎల్ఎన్ శాస్త్రీ, తెలుగు విభాగాధిపతి పి.రవికుమార్, సీనియర్ అధ్యాపకులు కాళోజీ అవార్డు గ్రహీత డా.సీతారాం, అధ్యాపకులు డా.జె.అనురాధ, కిరణ్ కుమార్, డా.కోటమ్మ, ఎంవి.రమణ, శ్రీనివాస్, హిందీ విభాగాధిపతి డా.గౌసియా, మధు విద్యార్థులు పాల్గొన్నారు.

పెరిగిన మున్నేరు


ఖమ్మంరూరల్: ఎగువన కురిసిన వర్షాలకు మండలంలోని తీర్థాల వద్ద మున్నేరు ప్రవాహం పెరిగింది. దీంతో దిగువన ఉన్న జలగంనగర్, నాయుడుపేట ప్రాంతం ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే రైతుల ఆర్థికాభివృద్ధి

కామేపల్లి: రైతుల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం అన్నారు. గురువారం స్థానిక రైతువేదికలో రైతు రుణమాఫీ పొందిన రైతులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తుందన్నారు. వైస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, ఏఓ భూక్యా తారాదేవి, నల్లమోతు లక్ష్మయ్య, నర్సింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, మాలోత్ సరిరాంనాయక్, మహేష్, దొడ్డ వేణు, సీఈఓ గాదె నాగయ్య పాల్గొన్నారు.

వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెం వెలుగుమట్ల జెడ్పీఎస్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం డివిజన్ వాసి కృపాకర్ రూ.30 వేల విలువైన బూట్లు, టై, బెల్ట్ వితరణగా అందజేశారు. కార్పొరేటర్ కూరాకుల వలరాజు, హెచ్ఎం ప్రమీలరాణి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం డాన్ బాస్కో, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, జానీవియా, బొడ్డు కిరణ్, రామారావు, రామకృష్ణ, రామాంజనేయులు షేక్ దస్తగిరి, షేక్ మునీర్ సైద్ బాబాత, నిర్మల్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.


సామగ్రి అందజేస్తున్న దాతలు

మధ్యాహ్న భోజనం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కూసుమంచి: మండలంలోని కిష్టాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు తురకగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శులు మౌనిక, మాధవి పాల్గొన్నారు. కారణాలు తెలియాల్సి ఉంది.

'పస్తులు ఉండి పనులు చేయాలా..?'

నేలకొండపల్లి: పస్తులుండి పనులు చేయాలా అని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు షేక్ రహిముతుల్లా అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. పీఆర్‌సీ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆరోగ్య కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. బాబు, షేక్ సైదులు, నగేష్, బుచ్చిరాములు, మస్తాన్, సుధాకర్, చంద్రయ్య, ఉపేందర్, శ్రీకాంత్, వీరబాబు, వీరబాబు పాల్గొన్నారు.

మొదలైన 'శ్రావణ' బోనం సందడి


బోనాలతో గుడికి వస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణ మాస బోనాల సందడి ప్రారంభమైంది. గురువారం నగరంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద బోనాల సందడి నెలకొంది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. నగరంలోని గణేష్ బోనాల నిలయం వద్ద ఉన్న శ్రీ వినాయక మందిరం నుంచి బోనాల జాతరను ప్రారంభించారు. మహిళలు 108 కలశాల బోనాలను ఎత్తుకొని డప్పు నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, నాగమణి, కొల్లా అరుణ, భానుమతి, పద్మావతి, సరస్వతి, అనూష, కృష్ణ, రవి, రాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎస్సీ వర్గీకరణ విజయ సారథి మందకృష్ణ మాదిగ స్వాగత విజయోత్సవ ర్యాలీకి అధిక సంఖ్యలో మాదిగలు తరలిరావాలని ఎంఎస్పీ నాయకులు కోరారు. గురువారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య, నర్సింహారావు, రాము, సైదులు, గోపాలరావు, మోహన్, ప్రభాకర్‌రావు, మంగమ్మ, నాగరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఖమ్మంఅర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో వ్యాధులు దరిచేరవని నగర అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. గురువారం నగరంలోని 4వ డివిజన్ జెడ్పీఎస్ఎస్ బాలాజీనగర్ పాఠశాలను సందర్శించి విద్యార్థుకు అవగాహన కల్పించారు. మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని, చేతులు శుభ్రం చేసుకున్న తర్వాతే ఆహారం తీసుకోవాలని సూచించారు.

నివాళి..

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల గ్రామానికి లావుడియా పుల్‌సింగ్ మృతి చెందగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, నాయకులు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: జనగాం పోలీస్ స్టేషన్లో న్యాయవాద దంపతులపై పోలీసు దాడి, హేయమైన దుశ్చర్యలను ఖండిస్తూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి చింతనిప్పు వెంకట్, కార్యవర్గం బార్ కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణ, శ్రీనివాసరావు, లతీఫ్, శేషగిరిరావు, సుగుణరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల17న ఖమ్మం నిజాంపేట మసీదులో నిర్వహించే ఇస్లాం ధార్మిక సభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం సభ పోస్టర్లను నిజాంపేట మసీదులో ఆవిష్కరించారు. మౌలానా హుస్సేనీ, షేక్ గౌస్, హఫీజ్ షేక్ అబ్దుల్లా, అహ్మద్ అలీ, ముజమ్మిల్, అక్బర్, సాజిద్, మహబూబ్ పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు


ఖమ్మంఅర్బన్: వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకట్

ఖమ్మంఅర్బన్: హైరిస్క్ ప్రాంతాలుగా ఆరోగ్యశాఖ గుర్తించిన మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించడంతో పాటు, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పరిరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. టేకులపల్లి, ఇందిరానగర్‌లోని వైద్య శిబిరాలను జిల్లా మలేరియా అధికారి వెంకట్ సందర్శించారు. ఆరోగ్య పరీక్షలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నగరంలోని 12 డివిజన్‌లో ప్రధానరోడ్డుపై పడిన గుంతలకు మరమ్మతులు చేశారు. కార్పొరేటర్ చిరుమావిళ్ల లక్ష్మినాగేశ్వరరావు, అధికారులు ఉన్నారు.

రఘునాథపాలెం మండలంలో...

మండలంలోని వీవీపాలెంలో ఇంటింటి సర్వే చేశారు. ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డిలు గ్రామంలో పారిశుద్ధ్యంపై పరిశీలించారు. మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జ్వరాలపై సర్వే చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు


నేలకొండపల్లి: గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మండల స్పెషల్ ఆఫీసర్, హౌజింగ్ ఈఈ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని బోదులబండ, అమ్మగూడెం గ్రామాలలో గురువారం కార్యక్రమాలను పరిశీలించారు. ఇంటింటా తిరిగి ప్రజలను చైతన్యం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, బోదులబండ వైద్యాధికారి డాక్టర్.గీత, ఏఎన్‌యం పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో వైద్యశిబిరం

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాల, చెరువుమాధారంలోని ఎస్సీ బాలుర వసతి గృహాలలోని విద్యార్థులకు గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.శ్రావణ్‌కుమార్, గురుకుల ప్రిన్సిపాల్ పద్మావతి, డాక్టర్ నిరోషా తదితరులు పాల్గొన్నారు.